క్లుప్తంగా

నేడు కేజీబీవీ అర్హుల సర్టిఫికెట్ల పరిశీలన

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని వివిధ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి గతేడాది జూలైలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా ఆధారంగా 1:3 జాబితాను విడుదల చేశారు. మెరిట్ జాబితా http://siricilladeo.com/download/index.php లింక్‌లో అందుబాటులో ఉందని డీఈవో రమేశ్‌కుమార్ తెలిపారు. అర్హులు గురువారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. జాబితాలో సందేహాలు ఉన్న అభ్యర్థులు 96429 59599, 94931 11179 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

28న జిల్లాస్థాయి యువజనోత్సవం

సిరిసిల్లకల్చరల్: యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన సర్వీసుల అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులకు వివిధ సాంస్కృతికాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జానపద గేయాలు, జానపద నృత్యాలు(సోలో, బృందం), కవిత్వం, కథారచన, చిత్రలేఖనం, హస్తకళలు, చేనేత కళారూపాలు, వ్యవసాయ ఉత్పత్తుల తయారీలో ప్రతిభావంతులైన యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. యువ తీ, యువకులు తమ ఎంట్రీలను ఈనెల 25 లోపు కలెక్టరేట్‌లోని జిల్లా యువజన సర్వీసుల శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



బోయినపల్లి: వెదురు ఉత్పత్తులతో మేదరి సంఘం ర్యాలీ

బోయినపల్లి: ప్రభుత్వం మేదరి సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని మండల మేదరి సంఘం నాయకులు కోరారు. బుధవారం మండలకేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురుతో చేసిన వస్తువులతో బస్టాండ్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం వెదురు ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. మేదరిబంధు పథకం అమలు చేసి, నిరుపేదలకు ఐదెకరాల భూమి, యాభై ఏళ్ల వారికి పింఛన్ అందించాలని కోరారు. మండల అధ్యక్షుడు గుల్ల బాలయ్య రాజయ్య, కోరెం దేవయ్య, మహేశ్, సురేశ్, దేవయ్య, బుచ్చయ్య, భీమయ్య తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛతా హీ' సేవా



కోనరావుపేట: మరిమడ్లలో కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల్లో చెత్తా చెదారం తొలగించారు. మరిమడ్లలోని ఏకలవ్య గురుకుల పాఠశాల ఆవరణను శుభ్రపరిచి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో శ్రీనివాస్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ లో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా హైస్కూల్ పాఠశాల విద్యార్థులతో బుధవారం ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ బొలగం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మిడిదొడ్డి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

రుద్రంగి: మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థులను చూసేందుకు తల్లిదండ్రులు వస్తే నీడ కూడా లేదు. విద్యాలయం భవనం రెండువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అధ్వానంగా మారాయి. దీనిపై ఈనెల 16న ‘నిలువనీడ కరువు’ అనే శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. దీనికి స్పందించిన అధికారులు విద్యాలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటుతామని బుధవారం ఏపీవో శ్రీహరి తెలిపారు.

బదిలీలు సరే.. భర్తీ ఎప్పుడో ?

- వివిధ శాఖల్లో పోస్టులు ఖాళీ
- అధికారులు లేక అవస్థలు
- గాడి తప్పుతున్న ప్రజాపాలన
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ఖాళీగా ఉన్న ఎంపీడీవో చాంబర్

ముస్తాబాద్: మండలంలో ప్రజాపాలన గాడి తప్పుతోంది. ముస్తాబాద్‌లో మూడునెలలుగా ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించే అధికారులు లేక క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. ప్రజలకు అత్యవసర సేవలందించే వ్యవసాయం, పశువైద్యం, మండల పరిషత్, ప్రజారోగ్య శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇన్‌చార్జిలతో పాలనఇలా..

మండలంలో ఇన్‌చార్జి అధికారులే విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీపై వెళ్లిన అధికారుల స్థానంలో కొత్త అధికారులు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ముస్తాబాద్ ఎంపీడీవో భాస్కర్‌శర్మ అనారోగ్యానికి గురై బదిలీపై వెళ్లారు. నాలుగు నెలలుగా గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్ ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- ముస్తాబాద్ పశువైద్యాధికారి జ్యోతి రెండునెలల క్రితం బదిలీ అయ్యారు. ఇక్కడ ఆఫీస్ సబార్డినేట్ విమల మాత్రమే అందుబాటులో ఉన్నారు. పశువైద్యం పడకేసింది. పోతుగల్, ఆవునూర్‌లలో జేవీవో పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి.
- మండల వ్యవసాయాధికారి నెలరోజుల క్రితం కేశవపట్నానికి బదిలీ అయ్యారు. అప్పటినుంచి ఇల్లంతకుంట వ్యవసాయాధికారి సురేశ్‌రెడ్డి ముస్తాబాద్ ఏవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఆవునూర్ ఏఈవో పోస్టు ఖాళీగా ఉంది.
- పోతుగల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనిరంతరం వైద్యసేవలు అందించాలి. ఇక్కడ ఇద్దరు ప్రభుత్వ అధికారులు పనిచేయాల్సి ఉంది. సీహెచ్‌వో, 7 మొదటి ఏఎన్ఎం పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. మండలకేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టు ఖాళీగానే ఉంది.
- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానచారి ఉద్యోగ విరమణ పొందారు. సిరిసిల్ల ప్రిన్సిపాల్ ఇక్కడ అదనపు బాధ్యతలు తీసుకున్నారు.
- రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ–2 పోస్టు, మండల వనరులకేంద్రంలో ఎంఈవో పోస్టు 15 ఏళ్లుగా ఖాళీగా ఉంది.
- ముస్తాబాద్ గ్రంథాలయం లైబ్రరీ పోస్ట్ 16 ఏళ్లుగా ఖాళీగా ఉండగా గంభీరావుపేట అధికారి ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- పర్యవేక్షణ కరువు

ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ కరువైంది. ఉపాధిహామీ, వనమహోత్సవం, అభివృద్ధి పనులు చూసేవారు లేరు. ఇక్కడి ఎంపీడీవోకు రెండుగ్రామాల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు ఉన్నాయి. జీపీలపై పర్యవేక్షణ కరువైంది. పశువైద్యాధికారి లేకపోవడంతో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలితే వైద్యం అందించేవారు లేరు. వ్యవసాయాధికారి లేకపోవడంతో ఇప్పుడు రైతు రుణమాఫీ సమస్యలను పరిష్కరించే వారు లేరు. ఇన్‌చార్జి అధికారి రైతులకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. పోతుగల్ ఆరోగ్యకేంద్రంలో 24 గంటలు వైద్యం అందే పరిస్థితి క నిపించడం లేదు. ఎంఈవో లేక మండలంలో ఉన్న 45 పాఠశాలలు,ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణ కరువైంది.

రుణమాఫీ అయిందో లేదో తెలియదు



నాకు రెండెకరాలు ఉంది. నాలుగేళ్ల క్రితం బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నా. రుణమాఫీ అయిందో కాలేదో తెలుసుకుందామంటే ఎవరు చెప్పడం లేదు. ఇక్కడ పెద్ద సార్ లేరట. ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదు.

– ధరంసోత్ పూరవ్వ, సేవాలాల్ తండా

అధికారులను నియమించాలి



మండలంలో ముఖ్యమైన శాఖల్లో అధికారులు లేరు. తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలి. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి. విద్య, వైద్యం, వ్యవసాయం పూర్తిస్థాయిలో అందించాలి.

– మెరుగు అంజాగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు



చందుర్తి : మండలంలోని బండపల్లి గ్రామ శివారులోని లోలెవల్ వంతెన వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తారు రోడ్డు ఆనుకుని భారీ గుంత ఏర్పడింది రాత్రిపూట వాహనదారులు గుంతలోపడితే ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్తులు చెట్ల కొమ్మలు అడ్డుగా వేశారు. రోడ్డు కొట్టుకుపోయి 15 రోజులు దాటినా అధికారులు మరమ్మతులు చేయడం లేదు. ప్రమాదాలు జరగకముందే రోడ్డు మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కాంతయ్య, ఆర్అండ్‌బీ డీఈ, ఫోన్ నెంబర్ : 9440818424

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జన వేడుకలు



ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ: వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో రెండ్రోజులుగా నిర్వహించిన గణేశ్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి బుధవారం తెలిపారు. ఇందుకు సహరించిన మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ, అగ్నిమాపక, ఇతర అన్నిశాఖల అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చోరీకి విఫలయత్నం

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో నరేశ్ గృహనిర్మాణం వద్ద ఓ వ్యక్తి ఇనుప సలాకాలను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించాడు. సీసీ కెమెరాలో గమనించిన నరేశ్ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు సదరు వ్యక్తిని పట్టుకొని విచారించారు. మేస్త్రీ పనిచేసుకుంటూ నివసించే తాను మద్యానికి బానిసై దొంగతనానికి పాల్పడ్డట్లు తెలిపాడు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చిన బస్సు చార్జీల కోసం డబ్బులు ఇచ్చి సొంత గ్రామానికి పంపించారు.

రూ.42వేలకు గణేశ్ లడ్డూ

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేటలో రాక్‌స్టార్ యూత్ అసోసియేషన్ వినాయక మండపంలో 11 రోజులపాటు విశేష పూజలందుకున్న లడ్డూకు భారీగా వేలం ధర పలికింది. గ్రామానికి చెందిన చెట్టి లక్ష్మణ్–కరుణ దంపతులు రూ.42వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

చందుర్తిలో జాతీయజెండాకు అవమానం

- ఆవిష్కరించిన జెండాను దించడం మర్చిన బీఆర్ఎస్ నాయకులు
- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన జోగాపూర్ యువకుడు



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఎగురుతున్న జాతీయ జెండాను దింపుతున్న జాన్సన్

చందుర్తి: జాతీయ సమాఖ్య దినంగా పాటిస్తూ చందుర్తి మండలకేంద్రంలో తెలంగాణతల్లి విగ్రహం సాక్షిగా మంగళవారం ఎగురవేసిన జాతీయ జెండాను అవనతం చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు విస్మరించారు. వ్యక్తిగత పనులపై చందుర్తి మండల కేంద్రానికి బుధవారం వచ్చి అదే మండలం జోగాపూర్‌కు చెందిన యువకుడు మ్యాదరి జాన్సన్ తెలంగాణతల్లి విగ్రహం ఎదుట ఎగురుతున్న జాతీయ జెండాను చూసి కిందికి దింపాడు. వెంటనే సదరు యువకుడు జెండాను తహసీల్దార్ శ్రీనివాస్‌కు అప్పగించి, అవమానపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విచారించి, చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఇల్లంతకుంట: ముస్కాన్‌పేటలో బుచ్చమ్మ చంద్రమౌళి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి పలువురికి మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమున్నవారికి కొదురుపాక కంటి దవాఖానాలో చేరాలన్నారు. బీసీఎం ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కంటి వైద్య నిపుణులు రీటా బహుదూర్స్, అనూష రెడ్డి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

ముస్తాబాద్: పట్టణంలో పందులు, వీధి కుక్కలు, కోతుల బెడద నుంచి రక్షించాలని పంచాయతీ ఈవో రమేశ్‌కు బీఆర్ఎస్ నాయకులు మెంగని మనోహర్, శీలం రాజు విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ ప్రజలపై దాడులు చేస్తున్నాయని అన్నారు.

ఇళ్లస్థలాలు ఇప్పించాలి

ఇల్లంతకుంట : తమకు ఇళ్లస్థలాలు ఇప్పించాలని కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులు బుధవారం మండల తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలను త్వరగా ఇప్పించాలని కోరారు. జిల్లా ఉద్యమకారుల చైర్మన్ భట్టి చంద్రమౌళి, అనంతారం మాజీ సర్పంచ్ చల్ల నారాయణ, శీను, శంకర్, తదితరులున్నారు

పోషకాహారం తీసుకోవాలి



చందుర్తి: గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

చందుర్తి: ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటు కోసమే పోషణ్ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గర్భిణులకు సీమంతం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని పోషకాహార లోపంతో ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆనందరెడ్డి, అనిల్‌రావు, పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు, అంగన్‌వాడి టీచర్స్ న్యాత పద్మ, రేణుక, గసికంటి రేణుక, ఏఎన్ఎం వజ్రమ్మ, ఆశ వర్కర్లు వసంత, రమణ, మహిళా సంఘాల వీవో రాధా, తల్లులు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. మండలంలోని మామిడిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వేములవాడ సీడీపీవో సౌందర్య గర్భిణులు, బాలింతలకు పోషకాహారం గురించి వివరించారు. ఎనీమియా పరీక్ష శిబిరాన్ని నిర్వహించి గర్భిణులు, బాలింతలకు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ గంగాలక్ష్మి, ఎంఎల్ హెచ్‌పీ అఖిల్, ఏఎన్ఎం వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, లక్ష్మి, స్వప్న, ఆశాకార్యకర్తలు సుజాత, జ్యోతి, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఆది’ జన్మదిన వేడుకలు



సిరిసిల్లటౌన్: కేక్‌కట్‌చేస్తున్న ఆది శ్రీనివాస్



కోనరావుపేటలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను సిరిసిల్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చేనేత వస్త్ర, వ్యాపార సంఘ భవనంలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆది శ్రీనివాస్‌తో జంబో కేక్ కోయించి, గజమాలను వేశారు. రాజశ్రీ షాపింగ్‌మాల్‌లో యాజమాన్యం ఆది శ్రీనివాస్‌ను పుష్పగుచ్ఛం అందించి సన్మానించింది. మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కామునివనిత, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, మ్యాన ప్రసాద్, చందన, స్వరూప, చంద్రకళ, వెంకటరమణ, ఆడెపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: అగ్రహారం శ్రీ జోడాంజనేయ స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చింతపల్లి శ్రీనివాసరావు, స్వామి, ఆగయ్య, వనపర్తి దేవరాజు, లింగయ్య, రాజు, తదితరులు ఉన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లి, ఎదురుగట్లతో పాటు అన్ని గ్రామాల్లో ప్రభుత్వవిప్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రూరల్ పార్టీ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రక్తదానం, అన్నదానాలు, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రూరల్ నాయకులు, కార్యకర్తలు, మహిళా అధ్యక్షురాళ్లు, పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నర్సింహా స్వామిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండలశాఖ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం వారి తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్నారు. మండల, గ్రామశాఖ అధ్యక్షులు తూము జలపతి, సామ మోహన్ రెడ్డి, డీసీసీ కార్యదర్శులు తర్రె లింగం, చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు ఎర్రం గంగ నర్సయ్య, మల్లయ్య, గండి నారాయణ, పల్లి గంగాధర్, దర్న మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేటలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలశాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు రాజేశం గుప్తా, షేక్ గౌస్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, లింగంగౌడ్, దేవానందం, మల్లారెడ్డి, గంగన్న యాదవ్, ఏలూరి రాజయ్య, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, బానోత్ రాజు, రాంరెడ్డి, రఫిక్, బాల్‌రెడ్డి, నంది కిషన్, సంతోష్‌గౌడ్, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట, పల్లిమక్త, సుద్దాల, కొలనూర్, కనగర్తి తదితర గ్రామాల్లో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. మండలశాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, గోపాల్, చేపూరి గంగాధర్, శంకర్, ప్రభాకర్, రుక్మిణి, మాజీ ఎంపీటీసీ చారి, నాయకులు తిరుపతి, రవి, వెంకన్న, ప్రదీప్, దేవరాజు, అజీం, లింబయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: రాజీవ్‌చౌక్‌లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్లమెంట్ కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, నాయకులు గుండెల్లి శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, రాజేశం, నరేశ్, రమణారెడ్డి, ధర్మేందర్, కిషన్‌రావు, అంజన్‌రావు, మట్ట రాణి, వేణు, దేవిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో వాటర్ ట్యాంకర్ బోల్తాపడింది. గ్రామానికి చెందిన చందులాల్ ట్యాంకర్‌లో నీటిని తరలిస్తుండగా నీళ్లు తక్కువగా ఉండడంతో కదుపులకు ట్యాంకర్ బోల్తా పడింది. ప్రమాదశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

కోనరావుపేట: రక్తహీనత లేకుండా గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలని సుద్దాల పల్లె దవాఖాన వైద్యాధికారి వెంకటేశ్ కోరారు. మండలంలోని సుద్దాలో ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కోడిగుడ్లు, చేపలు, మాంసం తదితర వాటిలో ఐరన్ ఎక్కువగా ఉంటుందన్నారు. వీటితో పాటు ఆకు కూరలు, విత్తనాలు, గింజలు, ఖర్జూరాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి అభిలాష్, ఏఎన్ఎంలు కవిత, అశోక్, అంగన్‌వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు పద్మ, జమున తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న చక్రధర్‌రెడ్డి

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండల ‘సాక్షి’ దిన పత్రిక పాత్రికేయుడు నిమ్మ బాల్‌చందర్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చక్రధర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీఆర్ఎస్ నేతకు..

మండల రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ ధ్యాన బోయిన రాజేందర్ తండ్రి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మండల డైరెక్టర్ నారాయణరావు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రాజారాం, నాయకులు రాజు, కిషోర్, శ్రీనివాస్ పరామర్శించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం: పట్టణంలోని గాంధీనగర్ సమీపంలోని మురుగుకాలువ పక్కన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు సిరిసిల్ల టౌన్ పోలీసులు వెల్లడించారు. మృతుడి వయసు 60 ఏళ్ల ఉంటుందని, మెరూన్ రంగు చొక్కా ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీ గదిలో ఉంచినట్లు సిరిసిల్ల టౌన్ సీఐకృష్ణ తెలిపారు.మృతదేహాన్ని గుర్తించినట్లయితే 83319 40870నంబర్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

గంభీరావుపేట: బీజేపీ జాతీయ నాయకుడు తన్వీందర్ సింగ్ కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండల కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. రాజేశ్వర్‌రావునగర్‌లో సిద్దిపేట, సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు రాంచంద్రారెడ్డి,వెంకటి, పర్శరాములు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న శాలివాహనులు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని శాలివాహన సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని బుధవారం ఆందోళన చేపట్టారు. సందర్భంగా శాలివాహనులు మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయడంతో భవన నిర్మాణ పనులు మొదలు పెట్టామని, నిధులు సరిపోక అసంపూర్తి పనులతో వినియోగంలోకి రాలేదన్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎదునూరి అంజయ్య, ఉపాధ్యక్షుడు రాములు, శంకర్, కిషన్, దేవయ్య, లక్ష్మణ్, వెంకటేశ్, ఎల్లయ్య, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు



తంగళ్లపల్లి: ఆర్టీసీ బస్సు మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మండలకేంద్రంలో బుధవారం సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు డ్రైవర్ బస్సును నిలిపాడు. కానీ ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు బస్సు దిగి ముందుకుతోయాల్సి వచ్చింది. అనంతరం స్టార్ట్ కావడంతో బస్సు బయలుదేరింది

మూడోరోజు గణనాథుల నిమజ్జనం



తంగళ్లపల్లి: కేసీఆర్ నగర్‌లో గణేశ్ శోభాయాత్ర

తంగళ్లపల్లి/గంభీరావుపేట/ముస్తాబాద్: మండలంలోని మండెపల్లి డబుల్ బెడ్ రూం సముదాయం (కేసీఆర్ నగర్)లో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. గంభీరావుపేటలో 23అడుగుల భారీ వినాయకుడిని, ముస్తాబాద్ మండలం పోతుగల్, ముస్తాబాద్, నామాపూర్, ఆవునూర్, గూడెం, తదితర గ్రామాల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.